పంచగ్రామాల భూ సమస్యపై మంత్రికి వినతి

విశాలాంధ్ర - సింహాచలం: పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచ గ్రామాల సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమరావతిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. 1903 సర్వే సెటిల్మెంట్ రికార్డులో వున్న రైతుల పేర్లు చూపించి, ఆ రైతులు దగ్గర కొనుక్కొన్న స్థలాలలో ఇళ్లు నిర్మించుకొన్నామని, కానీ ఆ భూములకు 1996-97లో అప్పటి ఎమ్మార్వో సింహాచలం దేవస్థానానికి రైతువారి పట్టాలు ఇవ్వడం వలన సమస్య వచ్చిందని వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు, కార్యదర్శి టీవీ కృష్ణంరాజు, అధ్యక్షులు వి.బి.ఎస్.ప్రతాప్, వి.హను మంతురావు, టిఎల్‌జెవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణాల్లో పేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర - మధురవాడ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చారని ఆ ఇళ్ల స్థలాలు పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాలలో కేటాయించారని అందులో చాలామంది పేదలకు ఇప్పటివరకు ఇళ్లస్థలాలు చూపలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే 1 సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని సీపీఐ ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా మొండిగా ముందుకెళ్లిందని, కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాల పట్ల సుముఖత చూపలేదన్నారు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం రూ. 1,80,000/-లు మాత్రమే ప్రకటించారని ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేరన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ముఖ్యమంత్రి అదేవిధంగా హామీ ఇస్తూ, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున ఇస్తామని చెప్పారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లే-అవుట్లను మార్పుచేసి పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలను కేటాయించాలని, రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అనంతరం 53వ సచివాలయ నిర్వాహక కార్యదర్శి బి.వెంకటరావుకి వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యురాలు ఎండి బేగం, పార్టీ శాఖ కార్యదర్శి కె.కుమార్, ఎంఎస్ పాత్రుడు, ఎన్.త్రినాథ్, కె.చిన్న, రమ్య, మణి, సంతోష్, కనక, తౌటమ్మ, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి పరిసర ప్రాంతాలలో రాజకీయ నాయకులు అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 97వ వార్డు సుజాత నగర్ జంక్షన్ నుంచి పాపయ్యరాజుపాలెం 502వ సచివాలయం వరకు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఆందోళన చేపట్టి సచివాలయం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో టీడీపీ, వైసీపీ నాయకుల కబంధ హస్తాలలో ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకుని ఇల్లులేని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ప్రభుత్వ భూముల్లో తామే ఎర్రజెండాతో భూ పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పెందుర్తి ఏరియా శాఖ కార్యదర్శి ఎన్.ఆసిరి నాయుడు, పార్టీ సభ్యులు ఎ.రమణ, అన్నపూర్ణ, అరుణ,రజనీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

26న దేశవ్యాప్త ప్రదర్శనలు జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్

విశాలాంధ్ర - విశాఖ: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 26వ తేదీన తలపెట్టిన ప్రదర్శనలు, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్ కోరారు. విశాఖ హనుమంతువాక జంక్షన్ వద్ద గురువారం పోస్టర్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో, ముఠా, బిల్డింగ్ వర్కర్స్, చిరు వ్యాపారులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెట్రోల్, డీజిల్ల ధరలులను జిఎస్టీ పరిధిలోకి తేవాలని, సమాన పనికి సమాన వేతనం, 26వేల రూపాయలు కనీసం వేతనం ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్లతో నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. ఈ నెల 26న డి.ఆర్.ఎం. ఆఫీస్ నుండి అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాలు, రైతు కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో మహా ప్రదర్శన, జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, జిఎన్ రాజేష్, జికె రెడ్డి, సుధ, జి.గంగ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ మండల విద్యాశాఖా కార్యాలయం, నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాల, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రేమ్ కుమార్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ ఎలా జరుగుతున్నది పర్యవేక్షించారు. విద్యార్థులతో పాటు భోజన పంక్తిలో కూర్చుని భోజనం చేసి భోజనం ఎలా ఉన్నది పరీక్షించారు. తరువాత ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సందర్భంలో బోధన సామాగ్రి ఉపయోగిస్తున్నది లేనిది పరిశీలించారు. మండల శాఖ అధికారులు, ఉపాధ్యాయులు బోధనలోను, బోధనేతర కార్యక్రమాల్లో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను ముందు వరుసలో నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం చేపల తిమ్మాపురంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా గురువులు, 4వ వార్డ్ కార్పొరేటర్ కొండబాబు, కర్రి అప్పారావు, దూడ అచ్చారావు, ఎమ్.అమర్ నాథ్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊట కుంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్

విశాలాంధ్ర - ఆనందపురం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఈజీఎస్ డైరెక్టర్ వైవికె షణ్ముఖ కుమార్ గురువారం ఆనందపురం మండలంలో పర్యటించారు. అందులో భాగంగా ముందుగా కనమాం, శొంఠ్యాం పంచాయతీలో పరిశీలన చేశారు. ముఖ్యంగా వర్షాకాలం నీటి నిల్వలు పెద్ద సంఖ్యలో ఉండాలని భూగర్భ జలవనరులు తగ్గకుండా తగిన జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఊట కుంటలు ఆల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్ వర్క్, మినీ అమృత సరోవర్ చెరువులో తనిఖీలు నిర్వహించి పనులు ఎంతవరకు వచ్చాయన్నది రికార్డ్ పరిశీలన చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమదేవి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, మండల ఎంపీడీవో జానకి, ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఏ.తిరుమలరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో సమస్యలుంటే తెలియపరచండి

విశాలాంధ్ర - ఆనందపురం: గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలుంటే రైతులు వెంటనే తెలియపరచాలని అందుకు అనుగుణంగా సర్వే జరిపించి నివేదిక రైతులకు అందజేస్తామని రీ సర్వే డిటి గోవిందరావు తెలిపారు. జగన్నాధపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఏమైనా సవరణలు పాస్ బుక్‌లో తప్పులు, కొలతల్లో ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఆనందపురం మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, స్థానిక సర్పంచ్ బంకశ్రీను, ఎంపీటీసీ విజినిగిరి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సర్వేయర్ సాయి గణేష్, వైసీపీ యూత్ ప్రెసిడెంట్ రెల్లి గురునాయుడు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభ మండలం తుని వలస గ్రామంలో గురువారం శ్రీ సత్యసాయి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని తుని వలస గ్రామంలోని 70 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. బాబా జన్మదిన సందర్భంగా సత్యసాయిబాబా భక్తి సంకీర్తనలు, దీపాలతో ఊరేగింపు, లలిత సహస్రనామం, భక్తి గీతాలాపన ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుని వలస సత్యసాయి కమిటీ సభ్యులు మోహన్ సాయి, కోటేశ్వరరావు, సూర్యం, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోజూ గంటపాటు పుస్తక పఠనం చేయాలి

విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



విశాలాంధ్ర - విశాఖ: పుస్తక ప్రియుల కోసం అన్ని రకాల పుస్తకాలను ఒకే చోట దొరికేలా పుస్తక ప్రదర్శనలు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఏర్పాటు చేయడాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అభినందించారు. విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు గురువారం సందర్శించారు. దేశంలో రోజురోజుకూ పుస్తక పఠనం పెరుగుతోందని, డిజిటల్ యుగంలో కూడా పుస్తకాల వైపు ఆసక్తి చూపుతున్న పాఠకులకు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజులో ఒక గంటైనా పుస్తకాలు చదివితే విజ్ఞానం, వివేకం అలవరచుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను తిలకించి వారి భవిష్యత్తుకు దోహదపడే పుస్తకాలను పొందాలని కోరారు. ఈ పుస్తక ప్రదర్శన నేటి తరం యువతకు ఎంతో దోహదపడుతుందని అన్నారు.

యాంటీబయాటిక్‌ల వినియోగంలో జాగ్రత్త అవసరం

విశాలాంధ్ర - మధురవాడ: యాంటీబయాటిక్స్‌ను అవసరానికి మించి వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వాటి వినియోగంలో జాగ్రత్త అవసరమని ఫార్మాకాలజి నిపుణుడు డాక్టర్ ఎ.శ్యామ్‌కుమార్ సూచించారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎమ్ఆర్) అవగాహన వారోత్సవాలలో భాగంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్), గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మితిమీరిన యాంటీ బయాటిక్స్ వినియోగం వల్ల సమస్యలు ఎదురవుతు న్నాయన్నారు. ఈ విషయంలో ప్రజారోగ్యం దృష్ట్యా యాంటిబయాటిక్స్‌ను భాద్యతగా ఉపయోగిం చాల్సి ఉందన్నారు. ఎఎమ్ఆర్ సమస్యపై ప్రజలను, ఆరోగ్య కార్యకర్తలకు చైతన్యం కలిగిం చడానికి అవగాహన వారోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్ దాస్, ప్రొఫెసర్ పి.రామారావు, జిమ్సర్ ఫార్మకాలజీ విభాగం అధిపతి డాక్టర్ టి.తులసి మాధురి తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులో జెడ్సీ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పి.సింహాచలం గురువారం 5వ వార్డ్ పరిధిలో సర్వే నం:27, శివశక్తినగర్ రోడ్డులో కొండవాలు ప్రాంతాలైన అయ్యప్పనగర్, వివేకానంద నగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్ శ్మశానవాటిక, బొట్టవాని పాలెం చెరువు తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావుతో కలసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కాలువలు, డ్రైన్లు, పార్కులు, కొండవాలు ప్రాంతాల నీటి సమస్యలు, విద్యుత్, శ్మశాన వాటికలు వాటి సమస్యలు, వేయవలసిన క్రొత్త విద్యుత్ స్తంభాలు వాటి లైట్లు ఏర్పాటును పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్‌లో అక్రమ బడ్డీలు, శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న ఆక్రమణ బడ్డీలను పరిశీలించారు. బొట్టవానిపాలెం చెరువు అభివృద్ధి, డంపింగ్ యార్డ్ వలన మారికవలస రాజీవ్ గృహకల్ప, బోరవానిపాలెం ప్రజలు పడుతున్న అవస్థలను కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కు వివరించారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం స్పందిస్తూ త్వరలోనే సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అధికారులు ఈఈ శాంతి రాజు, టౌన్ సర్వేయర్ ప్రభాకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాసరావు, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పి కొట్టండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన జరిగే ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతమ్మధార జంక్షన్ అల్లూరి విగ్రహం వద్ద గోడ పత్రికను ఆవిష్కరించారు. దేశానికి మూడోసారి ప్రధానమంత్రి అయిన మోడీ ప్రభుత్వం ఈ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతూ, కార్మికులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్రానికి జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడి సరుకులు సరఫరా చేయకుండా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోం దన్నారు. కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి వివిధ స్కీముల్లో పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన పథకం, ఆర్పీలు, సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించామలన్నారు. ఆటో, భవన నిర్మాణ, వీధివిక్రయదారులు, రవాణా రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో సమగ్ర చట్టం చేయాలని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీన అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిఆర్ఎం ఆఫీస్ నుండి జీవీఎంసీ వరకు జరిగే ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ .మధురెడ్డి, రావి అశోక్, శ్రీను, శివ, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పారా క్రీడాకారులకు స్థానంపై హర్షం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించినందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఆంధ్రా యూనివర్సిటీ మెయిన్ గేట్ దగ్గర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కి, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవి నాయుడు చిత్రపటాలకు పుష్పాలు పాలతో అభిషేకాలు చేసి ధన్య వాదాలు తెలిపారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు పట్టుదల కృషితోనే ఇదంతా సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ఉపాధ్యక్షులు ఆవల రమేష్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షులు డాక్టర్. శీతల్ మదాన్‌ఆం, ఆంధ్రా యూనివర్సిటీ అల్యూమినియం ఎస్సీ, ఎస్టీ, బీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆచార్య కె.జాన్, సెక్రటరీ ఆరేటి మహేష్, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు మర్రియంబుల శ్రీనివాస్, ఇంటర్నేషనల్ పారా ప్లేయర్ సత్తిబాబు, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాభ నగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం వందల కోట్లు టీడీపీ వెచ్చిస్తోందని విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. వంద రూపాయలతో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంపర అప్పారావు, కంపర కనకరాజు, కంచిపాటి నాగరాజు, కట్ట పెంటయ్య, నందం అప్పారావు, ఉరుకూటి వెంకటరమణ, రోంగలి సూరిబాబు, నాగేశ్వరరావు, వల్లూరి జగదీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతోనే సామాజిక న్యాయం

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశంలో కుల గణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ స్పష్టం చేశారు. నగరంలో రామా టాకీస్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న ఉదయం 10గం లకు కులగణన - సామాజిక న్యాయం అంశంపై నగరంలోని డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు సదస్సు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ కులగణన అంటే కేవలం సంఖ్యా పరమైన లెక్కలు మాత్రమే కాదని, ఆయా సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా పరమైన అంశాలన్నీ దాంట్లో ఉంటాయని పేర్కొన్నారు. దీనిద్వారా స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆయా సామాజిక వర్గాల్లో అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో తెలిస్తే మరింత అభివృద్ధి సాధించడానికి ఏం చేయాలనే స్పష్టత లభి స్తుందని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 50% దాటకూడదని సుప్రీంకోర్టు గతంలో రూలింగ్ ఇచ్చిన పరిస్థితులు ఉన్నాయన్నారు. 90 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నప్పుడు ఈ పరిమితి దేనికని రాజ్యాంగంలో ఎక్కడ ఈ సీలింగ్ లేదని తెలిపారు. కుల గణన ద్వారా ఈ సీలింగ్‌ను తొలగించి రిజర్వేషన్ పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, కోలా హరిబాబు, దళిత నాయకులు గొడుగు రాజు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు బత్తుల గౌతం బాబు, రాజాన సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు తాత్కాలిక డీఆర్ఎంగా మనోజ్ కుమార్ సాహూ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వాల్తేరు తాత్కాలిక డీఆర్ఎంగా మనోజ్ కుమార్ సాహూ బాధ్యతలు స్వీకరించారు. మనోజ్ కుమార్ సాహూ రైల్వేలో 26 సంవత్సరాలకు పైగా విభిన్న అనుభవాన్ని కలిగి ఉన్నారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వేలలో ఓపెన్ లైన్‌లలో, విశాఖపట్నంలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో వివిధ స్థానాల్లో సేవలందించారు. ఈయన సింగపూర్, మలేషియాలో అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌కు కూడా హాజరయ్యారు. అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ చేశారు. ఇటీవల డీఆర్ఎంగా ఉన్న సౌరబ్ ప్రసాద్ 25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన నేపథ్యంలో కొత్త డీఆర్ఎంని నియమించారు.

మత్స్య సంపదను కలుషితం చేయకుండా కాపాడుకోవాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సముద్రంలో ఉన్న మత్స్య సంపదను కలుషితం చేయకుండా కాపాడుతూ, అభివృద్ధి చేసుకుంటూ భావితరాలకు మత్స్య సంపదను అందించే విధంగా మత్స్య కారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం భారతీయ మత్స్య పరిశోధన సంస్థ, విశాఖపట్నం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వ హించిన మత్స్యకార అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సముద్ర మత్స్య సంపద పరిరక్షణ, నిర్వహణ, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి కాపాడుట మొదలగు అంశాలపై అవగాహన కల్పించడం తోపాటు, సముద్ర కాలుష్యం వల్ల మత్స్య సంపద నశించుట తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. మత్స్యకార బోట్లకు 100 శాతం సబ్సిడీతో ట్రాన్స్ పాండర్ లను అందజేయడం జరుగుతుందన్నారు. సుమారు 178 కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. సము ద్రంలో అనేక ప్రమాదాలను నివారించుకోవచ్చని తెలిపారు. మెరైన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవివర్మ మాట్లాడుతూ రింగ్ వలలు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రభుత్వం, న్యాయాలయాలు సూచించిన మార్గదర్శకాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.బామిరెడ్డి, శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి పాల్గొన్నారు.

లా విద్యార్థిని అత్యాచార ఘటనపై నిపుణుల కమిటీ వేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్థానికంగా గాజువాకకు చెందిన లా విద్యార్థిని అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు బాధితురాలికి న్యాయం చేయాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలపై ఆకృత్యాలకు అంతు లేకుండా పోయిందని అన్నారు. కామాంధుల చేతిలో యువతులు, మహిళలు, పసిపిల్లలు బలైపోతున్నారని చెప్పారు. యువతిని మోసం చేయడంతో పాటు లైంగికంగా హింసించే పనిలో భాగస్వాములను చేశాడని అన్నారు. వీరి బారి నుండి బయటపడే మార్గం లేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడవలసి వచ్చిందన్నారు. రాష్ట్రంలో వరుస ఘటనలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని అన్నారు. నిందితులు వంశీ, ఆనంద్, జగదీశ్, రాజేష్‌ల పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి ,జిల్లా కార్యదర్శి సత్యవతి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయుడు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, సంతోష్ నాయకత్వం వహించారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేగి

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు, జీవీఎంసీ 95వ వార్డు టిడిపి అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ, గొల్లపూడి బీసీ భవన్‌లో గవర కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు పరమేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో సత్కరించి పూల గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

22న ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో ఈనెల 22న ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా తెలియజేశారు. యేక్వోహామ కంపెనీ వారు ప్రొడక్షన్, ఇతర డిపార్ట్మెంట్లో ఉద్యోగాల కోసం ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రాడ్యుయేషన్, డిప్లొమా పూర్తయిన , చివరి సంవత్సరం చదువుతున్న మహిళలు ఈ జాబ్ మేళా కి హాజరు కావచ్చునని, 18 నుండి 24 సంవత్సరాల వయసు గల వారు, 50 కేజీలకు మించి బరువు గల వారు, 5.2 అడుగుల పొడవు గల వారు అర్హులని పేర్కొన్నారు. డిప్లొమా, డిగ్రీ వాళ్ళకి 2 నెలల ట్రైనింగ్ లో 7 వేల స్టైఫండ్ ఆ తరువాత 16,599 వేతనాలతో పాటు ట్రాన్స్పోర్టు, యాక్సిడెంట్, మెడికల్ లైఫ్ ఇన్సరెన్స్ కల్పిస్తారని ప్రిన్సిపల్ చెప్పారు. అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురంలో ఉద్యోగం చేయాల్సి వస్తుందని, ఈ సువర్ణ అవకాశాన్ని ఆసక్తి కలిగిన మహిళా నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని కోరారు.

చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి రైతు బజార్ వద్ద ఉన్న చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలని విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం సిఐటియు డిమాండ్ చేసింది. సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు కే.అప్పలనాయుడు ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ ఆఫీస్ వద్ద తోపుడు బండ్ల కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తోపుడు బండ్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి, గోపాలపట్నం జోన్ గౌరవ అధ్యక్షులు బి.వెంకట్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐద్వా జిల్లా నాయకులు బి.రమణి, జిల్లా నాయకులు మౌలాలి తదితరులు మాట్లాడుతూ 2024 తోపుడు బళ్ళు వర్తకులు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాలుగా సుమారు 70 కుటుంబాలు పెందుర్తి రైతు బజార్ వద్ద తోపుడుబళ్లు, నేలపైన బడ్డీలు పెట్టుకొని చిరు వ్యాపారాలు సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాయని, వీరిలో ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రెడ్డమ్మ, తార ప్రభుదాసు, రాజు, మహేష్, అన్నపూర్ణ, మహాలక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూపీఐపై ఎఫ్‌డీని తీసుకువచ్చిన సూపర్ డాట్ మనీ

విశాలాంధ్ర- విశాఖపట్నం: సూపర్. మనీ ఈరోజు సూపర్ ఎఫ్‌డిని లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది పూర్తి డిజిటల్ పొదుపు ఉత్పత్తి, ఇది ఫిక్స్‌డ్ డిపాజిట్లకు యూపీఐ సౌలభ్యాన్ని అందిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి ప్రకాష్ షికారియా చెప్పారు. ప్రక్రియను పూర్తిగా డిజిటల్‌గా (2 నిమిషాల కంటే తక్కువ), అనువైనదిగా అత్యంత రివార్డింగ్‌గా మార్చడం ద్వారా ఎఫ్‌డీలను పునర్నిర్వచించడం కంపెనీ లక్ష్యం అన్నారు. సూపర్ డాట్ మనీ లోని వినియోగదారులు ప్రస్తుతం ఆర్బీఐచే ఆమోదించబడిన ఐదు బ్యాంకుల నుండి ఎంచుకోవచ్చునన్నారు. సూపర్.మనీపై అన్ని ఎఫ్‌డీలు డీఐసీజీసీ ద్వారా 5,00,000 వరకు బీమా చేయబడతా యన్నారు. పరిశ్రమ మొదటగా సూపర్ ఎఫ్‌డి అనేది యువ భారతీయులలో పొదుపులను ప్రోత్సహించే లక్ష్యంతో ఉన్న ఉత్పత్తి అని, సూపర్ ఎఫ్‌డితో, వినియోగదారులు రూ.కంటే తక్కువ ఎఫ్ డిలను బుక్ చేసుకోవచ్చునన్నారు. 1000 మరియు 9.5 శాతం వరకు వడ్డీని కూడా పొందవచ్చన్నారు. డిజిటల్ స్థాని కుడు ఆర్థికంగా అవగాహన ఉన్న కొత్త-యుగం భారతీయ పెట్టుబడి దారుని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి రూపొందించబడిందని తెలిపారు.

సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి కోసం సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్

విశాలాంధ్ర- విశాఖపట్నం: సీఐఎల్ హెచ్ఆర్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రారంభ పబ్లిక్ ఆఫర్ కోసం సెబితో హెరింగ్ ప్రాస్పెక్టస్ (డిఆర్ హెచ్‌పి) దాఖలు చేసింది. పబ్లిక్ ఆఫర్‌లో ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ రూ. వరకు ఉంటుంది. 335 కోట్లు మరియు ప్రతి ఈక్విటీ షేరుకు రూ.2 ముఖ విలువతో 4,739,336 ఈక్విటీ షేర్లను విక్రయించే షేర్‌హోల్డర్‌లు. సిఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ లిమిటెడ్ నికర ఆదాయాన్ని అనుబంధ సంస్థలలో అదనపు వాటాల కొనుగోలు, అనుబంధ సంస్థలలో పెట్టుబడి, కంపెనీ యొక్క పెరుగుతున్న వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, గుర్తించబడని అకర్బన సముపార్జనలు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని ప్రతిపాదిస్తుంది.

మహిళా రక్షణకు కఠిన చట్టం తీసుకురావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్‌విపి లా కాలేజీ విద్యార్థినిపై జరిగిన సామూహిక హత్యాచారం కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త ప్రియాంక దండి అన్నారు. గురువారం ఎండాడలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్ లో ఏసీపీ సిహెచ్ పెంటరావుని పార్టీ నాయకులతో ఆమె కలిశారు. ఏసీపీని అడిగి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ విషయం తెలియగానే పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల రెడ్డి బాధితురాలికి అండగా ఉండాలని ఆదేశించారని, జిల్లా ఇంచార్జ్ డా.నూతన్ నాయుడు, డీసీసీ , సిసిసి సూచనలతో ఈ కేసు పురోగతి తెలుసు కోవడానికి ఏసీపీ సిహెచ్ పెంటరావు ని కలిశామన్నారు. ఆ అమ్మాయికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, ఇలాంటి అత్యాచారాలు జరగకుండా ఈ మానవ మృగాలు భయపడే విధంగా ప్రత్యేకంగా ఈ అంశం మీద అసెంబ్లీ సమావేశ పరిచి వెంటనే కఠిన చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రియాంక కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితురాలికి న్యాయం చెయ్యాలని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేసారు. హెూమ్ మంత్రి అనితా ప్రతిపక్షంలో ఉండగా అనేక మాటలు మాట్లాడారని, ఇప్పుడు బాధ్యత కలిగిన మంత్రి పదవిలో ఉన్నారని బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు గాయత్రి, సుశీల, నాయకులు జగన్ మురారి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టెలివిజన్, మత్స్యకారుల దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక ఒకటవ వార్డు, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్ట నందు టెలివిజన్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు టెలివిజన్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 21న ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని డిసెంబర్ 1996లో ఐక్యరాజ్యసమితి నవంబర్ 21వ తేదీని ప్రపంచ టెలివిజన్ దినోత్సవంగా ప్రకటించిందని విద్యార్థులకు వివరించారు.దీనిని 1924లో జాన్ లోగీ బైర్డ్ అనే స్కాటిష్ ఇంజనీర్ కనిపెట్టారని తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవం అనేది ప్రతి సంవత్సరం నవంబరు 21న ప్రపంచవ్యాప్తంగా జరుపబడుతోందని మత్స్యకారులకు గుర్తింపును అందించడం కోసం, మత్స్య పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలనే ఆకాంక్షతో ఆరోగ్యకరమైన సముద్ర పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియపరచడానికి మత్స్యకార సంఘాలు ఈ దినోత్సవం నిర్వహిస్తాయని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరి శెట్టి రమేష్, ఈగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులకు భూమి పూజ

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ ఐదవ వార్డు పరిధి స్వతంత్ర నగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలత భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 10 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని, స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో రోడ్లు కాలువలు, మెట్ల మార్గాలు, త్రాగునీటి పైప్ లైన్లు, పార్కుల అభివృద్ధి తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, మన్యాల సోంబాబు,వార్డ్ అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, జనసేన అధ్యక్షులు దేవర శివ,బోయి వెంకటరమణ,నమ్మి శ్రీను, బోయ రమాదేవి,ఈగల రవి, జనసేన నాయకులు సూరిబాబు, కంబపు కామరాజు,చంటి, రామకృష్ణ రెడ్డి,రాజేష్, కొత్తల శ్రీనివాసరావు, జోగేశ్వరరావు పాత్రో వర్క్ ఇన్స్పెక్టర్ రాజు, ఆలి సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఎంపిక

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు పోలీస్ బ్యారక్స్ గ్రౌండ్‌లో పురుషులు, మహిళలకు బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ సెలక్షన్‌లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన జట్టు2024 డిసెంబర్ 6నుండి 9వ తేదీ వరకు మారుటేరు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే ఏ.పీ. ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు 23డిసెంబర్ 2024లోపు జిల్లా కార్యదర్శికి సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు: కార్యదర్శి(వి.డి.బి.ఏ) జి.భూషణరావు 8919649048, 9966753209 సంప్రదించాలని కోరారు.

సాధనలో క్రికెటర్ల సందడి

విశాలాంధ్ర - పీఎం పాలెం: పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏకు చెందిన బి-గ్రౌండ్‌లో ఆటగాళ్ల సందడి నెలకొంది. గురువారం ఏడు జట్ల ఆటగాళ్లు ప్రాక్టీసు చేశారు. విదర్భ టీమ్ కెప్టెన్ జితేష్ శర్మ, ఉమేష్ యాదవ్, కరుణ్ నాయర్, చండీగఢ్ టీమ్‌కు చెందిన అమ్రిత్ లుబానా, అర్జున్ అజాద్ తదితర ఆటగాళ్లు సాధనలో పాల్గొన్నారు. అదేవిధంగా అస్సాం, రైల్వేస్, పాండిచ్చేరి, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ ఈజట్లు ప్రాక్టీసులో మునిగిపోయారు. దేశవాలీ టీ20 క్రికెట్ టోర్నీ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ పోటీలు విశాఖపట్నం పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పీవీజీ రాజు కాంప్లెక్స్‌లలో ఈ నెల 23వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ఆయా జట్లు పోటీపడనున్నాయి.

ఉన్నత సౌకర్యాలతోనే విశాఖ ఐటీ అభివృద్ధి

అసెంబ్లీలో భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్రంలో ఐటీకి విశాఖను గమ్యస్థానంగా చెయ్యడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. 10 వేల మందికి ఉపాధి కల్పించే టీసీఎస్ కంపెనీని విశాఖకు తీసుకు వస్తున్నందుకు ఐటీ మంత్రి లోకేష్ కు అభినందనలు తెలియజేస్తూ, బెంగళూరు, హైదారాబాద్ తదితర నగరాల్లో మాదిరిగా ఉన్నత స్థాయి సౌకర్యాలను ఇక్కడా కల్పించాలన్నారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఐటీపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రుషికొండ ఐటీ హిల్స్ పరిసరాలు సాయత్రం 6-7 గంటల సమయానికే నిర్మానుష్యంగా మారుతున్నాయని తెలిపారు. రోడ్లు, లైట్లు, 24 గంటలు విద్యుత్తు, మంచినీటి తదితర మౌలిక సౌకర్యాలను పటిష్ఠం చేయాలన్నారు. గత ప్రభుత్వ ధోరణితో మిలీనియం టవర్స్, ఎస్.టి.పి.ఐ. ఇంకుబేషన్ సెంటర్లు మూతబడ్డాయని, ఐ.బి.ఎం., హెచ్.ఎస్.బి.సి. వంటి దిగ్గజ సంస్థలైతే విశాఖ నుంచి కార్యకలాపాలనే విరమించుకున్నాయని పేర్కొన్నారు. వీటిని విశాఖకు తిరిగి తీసుకు రావడానికి ప్రయత్నించాలని మంత్రి లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. టీసీఎస్ తదితర ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోపు ఏర్పాటయ్యేలా చూడాలన్నారు.

పారిశ్రామికవేత్త బి.వి.రామారావు సేవలు చిరస్మరణీయం

- సంస్మరణ కార్యక్రమంలో పలువురు వక్తలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ పారిశ్రామికవేత్త తెలుగు రాష్ట్రాలలో పారిశ్రామిక విప్లవానికి పునాదులు వేసిన వారిలో ఒకరైన బలుసు వెంకట రామారావుకు పలువురు ఘన నివాళులు అర్పించారు. బి.వి.రామారావు ఈనెల 5వ తేదీన వయోభారం కారణంగా దివంగతులైన సంగతి తెలిసిందే. ఆయన సంస్మరణ కార్యక్రమాన్ని పాత వెంకోజీపాలెం యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఎమ్.వి.వి. ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో గురు వారం నిర్వహించారు. బి.వి.రామారావు కుమారుడు బి.వి.రామ్ నేతృత్వంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు, ప్రముఖులు, పాత్రికేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి బి.వి.రామారావు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అభివర్ణిం చారు. మంచి పరిపాలనా దక్షత, దూరదృష్టి కలిగిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి కావాలని.. అందరికంటే ముందు 1994 లోనే బి.వి.రామారావు ఆకాంక్షించారన్నారు. ఆయన ఆకాంక్షలకు అను గుణంగానే చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా బి.వి.రామారావు ఉపాధి కల్పించారని కొనియాడారు. అంతకుముందు బి.వి.రామారావు చిత్రపటానికి ఆయన సతీమణి బలుసు సతీ సావిత్రి, కుమారుడు బలుసు వెంకట రామ్,కోడలు రాధిక, మనవరాలు ధన్వి, కుమార్తె రామినేని వసంత లక్ష్మీ నివాళులు అర్పించారు.

అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి: మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్రంలో అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఓబీసీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్,పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిపై ప్రేమ పేరుతో నయవంచన చేసి దారుణంగా అత్యాచారం చేసిన ఘటన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేటట్లు చేసిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఇలాంటి సంఘటనలతో మనం ఇంకా ఆటవిక రాజ్యంలో ఉన్నామని పిస్తోందని, ఒక "లా" విద్యార్థిని ఈ అమానుషత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యాయత్నానికి సిద్ధం పడిందంటే మన వ్యవస్థల మీద నమ్మకం లేని స్థితి కనిపిస్తుందన్నారు. తిరుపతి జిల్లాలో మూడేళ్ల చిన్నారిని చిదిమేసిన ఘటన మరువకముందే ఈ ఘటన జరగడం దురదృష్టకరం, రాష్ట్రంలో ప్రతిరోజు మహిళలు, పిల్లలపై దాడులు అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయి, వ్యవస్థల నుండి సరిగా స్పందన ఉండకపోవడం, నిందితులకు సరైన శిక్ష పడకపోవడం, జాప్యం జరగడం వలన నిందితులు మరింత చేలరేగిపోతున్నారన్నారు. ఈ ఘటనలో బాధిత విద్యార్థినికి, వారి కుటుంబానికి మనోధైర్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని, సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

డిఆర్‌హెచ్‌పి దాఖలు చేసిన సాత్విక్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: సాత్విక్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మాడ్యూల్ తయారీ కంపెనీలలో ఒకటి. భారతదేశ సోలార్ ఎనర్జీ మార్కెట్‌లో కీలక ప్లేయర్‌గా స్థిరపడింది. తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ("డి ఆర్ హెచ్ పి ")ని మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("సెబి")లో ఫైల్ చేసింది.

కంపెనీ ఈక్విటీ షేర్ల ఆఫర్ ద్వారా (ఒక్కొక్కటి ముఖ విలువ రూ.2) ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌ల ద్వారా రూ.11,500 మిలియన్ల (రూ.1150 కోట్లు) వరకు నిధులను సేకరించాలని యోచిస్తోంది. ఈ ఆఫర్‌లో రూ.8500 మిలియన్ల (రూ.850 కోట్లు) ("తాజా ఇష్యూ") మొత్తం ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ మరియు రూ.3000 మిలియన్ల (రూ.300 కోట్లు) వరకు విక్రయించే షేర్‌హోల్డర్‌ల ద్వారా అమ్మకానికి ఆఫర్ ఉంటుంది.

భీమిలి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్షునిగా సుత్తి శ్రీనివాస్ ఎన్నిక

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి ప్రెస్‌క్లబ్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నూతన కార్యవర్గం ఎన్నిక తగరపువలసలో జరిగింది. పి.ఆర్.పి వర్మ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విలేకరి ప్రతిపాదించిన ఈ కింది కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా అమోదించారు. అందులో భాగంగా అధ్యక్షులుగా సుత్తి శ్రీనివాసరావు (విశాలాంధ్ర), ప్రధాన కార్యదర్శి ఎల్.గణపతిరావు (సూర్య), సహాయ కార్యదర్శి కె.రవి కిరణ్ (విబిసి టీవి), కోశాధికారి ఎ.రోజా (విజన్), ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.రాజు (మనం), ముఖ్య సలహాదారులుగా పి.ఆర్.పి వర్మ (ఆంధ్ర జ్యోతి), శ్రీనివాస్ రెడ్డి (సాక్షి), వి.రంగధామం (ఆంధ్రప్రభ), వి.వెంకట్ (ఈనాడు), డి.వి చలపతిరావు (జర్నలిస్ట్ ఫవర్), శివాజి (సాక్షి)లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సుత్తి శ్రీను మాట్లాడుతూ విలేకర్ల సంక్షేమం కోసం నీతి నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎల్.గణపతిరావు మాట్లాడుతూ అవినీతికి తావివ్వకుండా, నిజాయితీగా పని చేస్తానన్నారు. సంఘం యొక్క నియమ నిబంధనలకు లోబడి పని చేస్తానన్నారు.

జీవీఎంసీ పి.జి.ఆర్.ఎస్ నమోదు కౌంటర్ల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థకు ప్రతి సోమవారం నమోదవుతున్న ప్రజా వినతులు, ఫిర్యాదులను పూర్తి వివరాలతో క్లుప్తంగా నమోదు ప్రక్రియ జరగాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల పి.జి.ఆర్.ఎస్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, విడుదల చేసిన ఆదేశాల మేరకు, జీవీఎంసీ ప్రజలకు అందించవలసిన సేవలు,సంక్షేమ పథకాలు కల్పించవలసిన మౌలిక సదుపాయాలలో ఎటువంటి లోపాలు జరుగకుండా ఉండేవిధంగా నేరుగా ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు సంబంధిత విభాగాలకు నేరుగా చేరుకునేందుకు వీలుగా జీవీఎంసీ విభాగాలకు సంబంధించి 5 పీ.జి.ఆర్.ఎస్ ప్రత్యేక కౌంటర్లను ప్రధాన కార్యాలయంలో అన్ని పని దినాల్లో స్వీకరించే ఒదుకుగాను ఏర్పాటు చేయడమైనది అన్నారు. ఈ కౌంటర్లలో ఏర్పాటు చేసిన ఉద్యోగులు ప్రజా వినతులు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు ప్రక్రియ జరపాలని ఉద్యోగులను ఆదేశించారు. నమోదు ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకుని అన్ని పని దినాలలో వినతులు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియ సూచించిన ఆఫీస్ పని దినాలలో జరపాలని, ముఖ్యంగా ప్రతి సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో అధికంగా ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు వస్తాయని విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సమయపాలనతో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని అన్నారు.

మత్స్యకారుల జీవితాలు అగ్యమగోచరం

మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు ఆవేదన

విశాలాంధ్ర - భీమిలి: అడ్డూ అదుపు లేని కాలుష్య పరిశ్రమలు, తీర ప్రాంతం కబ్జాదారుల మధ్య మత్స్యకారుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయని గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు, మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం భీమిలి జోనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడారు. సముద్రం అంతా కాలుష్య పరిశ్రమలు వదిలిన కెమికల్ తో నిండిపోయి మత్స్య పరిశ్రమ కుదేలయిందని అన్నారు. తెచ్చిన చేపలకు గిట్టుబాటు ధరలు లేక నానా అవస్థలు పడుతున్న మత్స్యకారులకు ఒకపక్క పొల్యూషన్, మరోపక్క తీర ప్రాంతంను కబ్జా చేసిన కబ్జాదారులతో సతమతమవుతున్నామని అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పండగ వాతారణంలో ఉండవలసిన మత్స్యకారులు అనేక సమస్యలతో సతమతమవుతూ రోడ్డెక్కవలసిన పరిస్థితి వచ్చిందని అన్నారు. మాజీ రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షులు కోలా గురువులు నిరసనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ పుక్కళ్ళ నాగరాజు, వంకా నాగేశ్వరరావు, మదర్ పాఠశాల ప్రిన్సిపాల్ చీకటి రమేష్, ఎగువపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏపీ బడ్జెట్‌లో మత్స్యకారులకు మొండి చేయి

- మత్సకార దినోత్సవం సందర్భంగా వాసుపల్లి

విశాలాంధ్ర - విశాఖ కలక్టరేట్: ఏపీ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన బడ్జెట్‌లో మత్స్యకారులకు మొండి చేయి చూపించిందని విశాఖ దక్షిణ మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఆశీలుమెట్ట కార్యాలయంలో గురువారం తనను కలిసిన గంగపుత్రులతో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ జాలర్ల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, విశాఖ మత్స్యకారుల్ని అన్ని విధాలా ఆదుకున్నారని గుర్తు చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం చోటు చేసుకుంటే ఆఘమేఘాలపై జగన్ స్పందించి, భారీ స్థాయిలో పరిహారం ప్రకటించారని గుర్తు చేశారు. వైసీపీ పథకాలకూ ఈ కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబుకు మత్స్యకారులంటే ఇంకా చిన్న చూపేనని, బడ్జెట్ కేటాయింపులో వారికి చోటు లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికల ముందు వారిని మభ్యపెట్టి ఇచ్చిన హామీల్ని చంద్రబాబు గంగలో కలిపేశారని, 100కి.మీకి ఒక జెట్టీ నిర్మిస్తామని చెప్పి గతంలో కూడా మోసం చేశారన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల్ని పెంచేందుకు ప్రభుత్వాలే కృషి చేయాలని, నడి సంద్రంలో ప్రాణాలకు తెగించి వేట సాగిస్తున్న జాలర్ల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వాసుపల్లిని స్థానిక వైసీపీ నేతలు కలిసి భారీ చేపను బహూకరించి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షులు పీతల వాసు, వేణు, దశమంతుల మాణిక్యాలరావు, తాడి రవితేజ, 31వ వార్డు అధ్యక్షులు బాబు ఆనంద్, 33వ వార్డు అధ్యక్షులు ముత్తాబత్తుల రమేష్, సూర్య, లింగం శ్రీను, దుర్గారావు, నర్సింగరావు, వెంకటేష్, లక్ష్మణ్, కట్టుముచ్చు సాగర్, శ్రీశ్రీ జగన్నాథ స్వామి ఆలయ ధర్మకర్త, అది కనగల రామరాజు, మైలిపిల్లి మాసేను, గనగల్ల గరకయ్య, బొడ్డ ఆనంద్, గనగల రాజేష్, వాసుపల్లి రాజు, రాష్ట్ర కాళింగుల మాజీ డైరెక్టర్ ససపల రవీంద్ర, దక్షిణ నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, షకీల్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణతో పాటు స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.